ప్రజాశక్తి

ఆదివారం 20 అక్టోబర్ 2024



21 నుంచి పోలీసు అమరవీరుల వారోత్సవాలు

ఎస్పీ వి.రత్న



ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమర వీరుల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకుంటూ వారోత్సవాలను పది రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా 21న అమరవీరుల సంస్మరణ దినం స్మృతి పరేడ్, పోలీసు అమరులకు నివాళులు, శ్రద్ధాంజలి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 22న పోలీసు అమరుల గ్రామాల సందర్శన, అమరుల సేవలను ప్రజలకు తెలియజేయడం కార్యక్రమాలు ఉంటాయన్నారు. 24న పోలీసు సేవలపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. 26న పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. 27న పోలీసు ఓపెన్ హౌస్‌లు నిర్వహిస్తామన్నారు. పోలీసులు నిత్యం వినియోగించే ఆయుధాలు, సాధనాలు, పరికరాలను ప్రదర్శించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. 28న వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 29న సదస్సులు నిర్వహిస్తామన్నారు. పోలీసుల సేవలను వివరిస్తూ నాటికలు, పాటల రూపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని ప్రత్యేక సాధకులకు సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 31న సమైక్యత భావాన్ని చాటే కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో నిర్వహిస్తామన్నారు. ఇదే రోజు యూనిట్ రన్, క్యాండిల్ ర్యాలీతో పోలీసు అమర వీరుల వారోత్సవాలు ముగుస్తాయన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేద్దాం

- జెడ్పీ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్
- సమస్యలపై ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపిపిల నిలదీత
- సత్యసాయి కలెక్టర్ గైర్హాజరుపై పలువురి అభ్యంతరం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో పని చేస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి, సంక్షేమ సాధించే దిశగా ముందుకు సాగాలని రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ఎంఎస్.రాజు, పల్లె సింధూర రెడ్డి, అనంతపురం కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా డిఆర్‌ఒ కొండయ్య, జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి సీఈవో వెంకటసుబ్బయ్యతో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, పాల్గొన్నారు.



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు
మంత్రి సత్యకుమార్ యాదవ్

ఎంతో నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరూ ఆయా ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ఎంపిపిలు, జెడ్పీటీసీలు పని చేయాల్సి ఉందన్నారు. రాజకీయ విభేదాలు పక్కనపెట్టి అభివృద్ధి కోసం ముందుకు నడవాల్సిన అవసరం ఉందన్నారు. రైతాంగానికి సంబంధించి సాగునీటి వ్యవస్థ, హెచ్ఎల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా సాగునీరు అందించాల్సిన అవసరంపై ఎమ్మెల్యేలు చెబుతున్నారన్నారు. కరువు జిల్లా అనంతకు సాగునీటిని అందించేలా అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించి 49 చెరువులు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నింపాలని ఇటీవల నిర్వహించిన ఐఎబి సమావేశం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. చెరువులకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారు.. ఎంత వేగంతో వస్తున్నాయి.. లీకేజీలు ఎక్కడున్నాయి తదితర అంశాలను యజ్ఞంగా తీసుకుని అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. కాలువల వెంట ఏఈలు, డిఈలను పంపకుండా నీరు వచ్చేస్తున్నాయి అనడం సరైన పద్ధతి కాదని అధికారులకు చెప్పారు. క్షేత్రస్థాయిలో ఏదైనా ఇబ్బందులు ఉంటే తెలపాలన్నారు. మండల స్థాయిలో నిధులు కావాలన్నా, లీకేజీలు ఉన్నాయన్నా పైఅధికారులు దృష్టికి తీసుకువెళ్లాన్నారు. ప్రజల ఓట్లతో ప్రజాసేవ చేసేందుకు ప్రజాప్రతినిధులుగా వచ్చామన్న విషయాన్ని సభ్యులు అందరూ గుర్తుంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణ రహదారులను వేసేందుకు నివేదికలు పంపాలని కలెక్టర్, జెడ్పీ ఛైర్‌పర్సన్‌ను కోరారు. వీటికి త్వరితగతిన ప్రతిపాదనలు పంపితే కేంద్రం ప్రయారిటీ ప్రకారం నిధులు విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలన్నారు. అవసరం ఉన్నచోట్ల పిహెచ్‌సిల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రాబోయే సమావేశానికి రెండు జిల్లాలకు సంబంధించి కలెక్టర్ స్థాయి నుంచి కింద స్థాయి అధికారులు అందరూ హాజరుకావాలని స్పష్టమైన ఆదేశాలు ఇస్తామన్నారు.

ఏ ప్రాతిపదికన పింఛన్లు తొలగిస్తున్నారు..?
జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు నెలల్లోనే 5,098 వద్ధాప్య పింఛన్లు, 519 వికలాంగుల పింఛన్లను తొలగించారని దేని ప్రామాణికంగా వీటిని తొలగించారనే విషయాన్ని అధికారులు తెలపాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ ప్రశ్నించారు. ఇంతకు ముందు అర్హత ఉండి ఆన్లైన్లో మంజూరై వచ్చిన పింఛన్లను ఎందుకు తొలగిస్తున్నారన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఖచ్చితంగా ప్రొటోకాల్ పాటించేలా అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. సాధారణ సర్వసభ్య సమావేశానికి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ హాజరయ్యేలా చూడాలన్నారు.



చెరువులను కృష్ణా జలాలతో నింపండి
ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని చెరువులనూ కృష్ణా జలాలతో నింపాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. కొత్తచెరువు, బుక్కపట్నం మండలంలోని అన్ని చెరువులకు నీరు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. హంద్రీనీవా కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. చెరువులను ఎప్పుడు నీటితో నింపుతారనే విషయాలను తేదీలతో తెలపాలన్నారు.



అర్హులందరికీ పింఛన్లు
ఎమ్మెల్యే ఎంఎస్.రాజు



గతంలో అనర్హులకు పింఛన్లు ఇస్తున్నారని, అలాంటి వాటిని తొలగించే క్రమంలో పారదర్శకత పాటించి తొలగింపుదారులకు అర్థం అయ్యే విధంగా తెలియజేసి వాటిని తొలగించి అర్హులకు ఇవ్వాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. సదరం సర్టిఫికెట్లను మూగ, చెవిటి, అర్హత కలిగిన వారికి ఇవ్వాలన్నారు. సమావేశానికి శ్రీ సత్యసాయి జిల్లా అధికారులు ఒక్కరూ రాకుండా ఉన్నారని, ఉన్నవారిలో కూడా ఇన్‌ఛార్జి వ్యవస్థ ఉందన్నారు. జెడ్పీ సమావేశానికి రాకుండా ఉండడం సరికాదన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు
కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్



జెడ్పీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆయా శాఖల సాధారణ యాక్టివిటీలు, పల్లె పండుగ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం పిలవాలన్నారు. ఉపాధి హామీ కింద గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ అప్రూవల్‌తోనే పనులు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కువ చెక్‌డ్యామ్‌లు, ఫారంపాండ్లు, ఇతర పనులు చేపడతామని, భైరవానితిప్ప ప్రాజెక్ట్‌లో ప్రాధాన్యతగా నీటి నిల్వకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతపురం నగరంలో ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులకు తెలిపామని, ప్రాధాన్యత పరంగా ప్రాజెక్టులు జిల్లాకు వస్తాయన్నారు. ఈ సమావేశంలో రెండు జిల్లాల వ్యవసాయ అధికారులు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, డీఆర్డీఏ పీడీలు ఈశ్వరయ్య, నరసయ్య, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైం

ఉర్దూ భాష అభివద్ధి, సాహిత్యం, విభిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి జాతీయ ప్రాంతీయ స్థాయి పురస్కారాలు అందజేయనున్నామని, ఇందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ సుబ్బారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా నవంబర్ 11న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని (మైనార్టీ దినోత్సవం) సందర్భంగా మౌలానాఅబుల్ కలాం ఆజాద్ జాతీయ పురస్కారం డాక్టర్ అబ్దుల్ హబ్ ప్రాంతీయ పురస్కారాలను సంబంధించి అత్యుత్తమ సేవలందించిన వారికి పురస్కారం కింద రూ.1.25 లక్షల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక, డాక్టర్ అబ్దుల్ ప్రాంతీయ స్థాయి పురస్కారం కింద లక్ష రూపాయలు నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తారన్నారు. రాష్ట్రానికి చెందిన ఉర్దూ సాహితీవేత్తలు, పండితులు, కవులు, పాత్రికేయులు, విమర్శకులు, పరిశోధకులు, గద్య బోధన, ఉర్దూ సేవలు అందించిన ఆరుగురికి జీవితకాల సాఫల్య పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ఉర్దూ భాషాభివద్ధి కోసం కృషి చేసే ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉత్తమ విద్యార్థి, ఉత్తమ అధ్యాపక పురస్కారాలను అందజేయనున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఉర్దూ అకాడమీ ద్వారా జారీ చేసిన దరఖాస్తు ఫారాలను పూరించి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, డిఇఒ, డిప్యూటీ డిఇఒ ద్వారా, ఇంటర్, డిగ్రీ కళాశాలలకు చెందిన వారు ప్రిన్సిపాళ్లు,ఆర్ఐఒల ద్వారా ప్రమాణ పత్రాలను జతచేసి ఈ నెల 25వ తేదీ లోపు డాక్టర్ మహమ్మద్ మస్తాన్ డైరెక్టర్ అండ్ సెక్రటరీ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్, ఉర్దూ అకాడమీ, డోర్ నెంబర్ 6-16 ఏ/ 12 మాళవిక విల్లా హెచ్‌డిబి కాలనీ, భవానీపురం, విజయవాడ అనే చిరునామాకు స్వయంగా గానీ, పోస్టుద్వారా పంపాలన్నారు.

ఎస్సీ కాలనీకి రహదారి ఏర్పాటు చేయాలి : సిపిఎం



వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రహదారి ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం మండలంలోని బడన్నపల్లి గ్రామ ఎస్సీ కాలనీ వాసులు సిపిఎం నాయకులతో కలిసి ఎంపిడిఒ సాయి మనోహర్‌కి వినతి పత్రం అందజేశారు. సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ బడన్నపల్లి గ్రామం నుంచి అనంతపురం రోడ్డు వరకూ రహదారి మొత్తం గుంతలమయమైందని, వర్షం కురిస్తే పూర్తిగా బురదమయం అవుతుం దన్నారు. దీంతో రైతులు వ్యవసాయ తోటల నుంచి పంట దిగుబడిని గ్రామంలోకి తీసుకురావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు సైతం నానా అవస్థలు పడుతున్నారన్నారు. అధికారు లు స్పందించి సాధ్యమైనంత త్వరగా రహదారి మరమ్మతులు పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమం లో చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు జి.హరి, మారుతి, రామాంజనేయులు, ఎస్సీ కాలనీవాసులు పాల్గొన్నారు.

పశువులను రోడ్డుపైకి వదలొద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి-సోమందేపల్లి

యజమానులు తమ పశువులను రోడ్డుపైకి వెళ్లకుండా చూడాలని ఎస్ఐ రమేష్ బాబు శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. చాలామంది పశువుల యజమానులు వాటిని విచ్చలవిడిగా వదిలి వేయడం వల్ల పశువులు రోడ్లపైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇకపై పశువుల యజమానులు రాత్రి సమయంలో వాటిని ఇంటి వద్ద కట్టివేయాలన్నారు. లేనిచో పశువులను సమీపంలోని గోశాలకు తరలిస్తామని స్పష్టం చేశారు.

రూ.10 నాణెం మార్పిడి జరగాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

ప్రజలు అపోహలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ రూ. 10 నాణెంను ఇచ్చి పుచ్చుకోవడం చేయాలని స్థానిక కెనరా బ్యాంక్ రెండవ మేనేజర్ సురేష్ సూచించారు. మేనేజర్ శనివారం మేనేజర్ టిడిపి మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, నాయకులు డివి ఆంజనేయులు, టౌన్ కన్వీనర్ వడ్డే సూరిలకు రూ. 10 నాణెలు అందించి ప్రజల్లో ఉన్న అపోహలను పోగొట్టి నాణెలు మార్పిడి జరిగేలా మీ వంతు కృషి చేయాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల మేరకు ప్రతి వినియోగదారుడు రూ. 10 నాణెలను క్రయవిక్రయాల్లో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సైబర్ నేరాలు, మహిళల భద్రతపై పోలీసులు జిల్లా వ్యాప్తంగా శనివారం నాడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల శివారులో ఉన్న నివాసాల వద్దకు వెళ్లి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఇంటి భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహనాలను క్షుణంగా తనిఖీలు నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వాహనదారులకు తెలియజేశారు.

ఉపకారాగారం తనిఖీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఉపకారాగారాన్ని సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న సౌకర్యాలు, ఉచిత న్యాయ సహాయం, నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది ఖైదీలు ఉన్నారు, ఏఏ కేసుల్లో ఉన్నారు.. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలులో ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలపాలన్నారు. జైలు నుండి బయటకు వెళ్లిన తర్వాత ప్రవర్తన మార్చుకుని ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగార అధికారి అంజినాయక్, న్యాయవాదులు గోపాలకృష్ణ, నవేరా, అంజనమ్మ, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి ఎంశ్రీధర్

వర్షంతో పంట నష్టపోయాం.. ఆదుకోండి..

మంత్రి సత్యకుమార్‌ను కోరిన రైతులు

ప్రజాశక్తి-బత్తలపల్లి

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన వేరుశనగ పంట కుళ్లిపోతుందని ఆదుకో వాలని మండలంలోని పోట్లమర్రి గ్రామానికి చెందిన కౌలు రైతు వీరయ్య రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. మంత్రి సత్యకుమార్ శనివారం మండలంలో పర్యటించగా బాధిత కౌలురైతు వీరయ్య కమతం మోహన్‌తో కలిసి వర్షానికి కుళ్లిన వేరుశనగ పైరును మంత్రికి చూపి పరిస్థితిని వివరించారు. రూ. 1.8 లక్షలు ఖర్చు చేసి బోరుబావి కింద 5 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశానన్నారు. తుఫాన్ ప్రభావంతో కోత కోసిన వేరుశనగ పంట పొలంలోనే వర్షానికి తడిసి కుళ్లిపోతుందని, పశుగ్రాసానికి కూడా పనికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఆదుకోవాలని కోరాడు. స్పందించిన మంత్రి ఈ విషయాన్ని ఏవో ఓబిరెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

భారీ వర్షాలకు కూలిన ఇల్లు

ధర్మవరం రూరల్ : ఇటీవల కురుస్తున్న వర్షాలకు శనివారం పట్టణంలోని చిన్నకేశవపురంలో షేక్‌బాను అనే మహిళ ఇల్లు కూలిపోయింది. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం ధాటికి ఇల్లు గోడలు విరిగిపడిపోయాయి. ఇంతలో ఇంట్లో వున్న ఆమె అప్రమత్తమై బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్ కూలిపోయిన ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించి బాధిత మహిళను పరామర్శించారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి, బీమినేని ప్రసాద్‌నాయుడు, సూరి, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న ఇళ్ల వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం

కదిరి అర్బన్ : ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న గృహాల వివరాలను ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదిస్తామని తహశీల్దార్ మురళీకృష్ణ శనివారం తెలిపారు. పట్టణంలోని వాటర్ ట్యాంక్ రోడ్డులో నివాసం ఉంటున్న ఓ ఇల్లు పూర్తిగా నేలమట్టం కాగా మరో ఇల్లు పాక్షికంగా దెబ్బతినిందని అధికారులు తెలిపారు. సున్నపుగుట్టతండాలో 3, కదిరి కుంట్లపల్లిలో 1, ఏటిగడ్డతండాలో 1, ఎగువపల్లిలో 1, కాలసముద్రం గ్రామంలో 1 ఇల్లు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. తహశీల్దార్ బాధితులను కలిసి వివరాలు సేకరించారు. ఇంకా ఎక్కడైనా వర్షాలకు గృహాలు పడిపోయి ఉంటే సచివాలయం లేదా తహశీల్దార్ కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని సూచించారు.



వర్షాలకు కూలిన ఇంటిని పరిశీలిస్తున్న టిడిపి నేతలు

పట్టణ అభివృద్ధికి సహకరిస్తాం

భవన యజమానులకు నష్ట పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి హిందూపురం

పట్టణం అభివద్ధికి తాము సహకరిస్తామని, అయితే గతంలో చర్చించిన విధంగా కాకుండా మరింత రోడ్డు విస్తరణ చేపడతామంటే ఒప్పుకోమని రైల్వే రోడ్డు భవన యజమానులు తెలియజేశారు. పురపాలక శాఖ పట్టణంలో రైల్వే రోడ్డు విస్తరణ చర్యలను ప్రారంభించింది. ఈ మేరకు రోడ్డుకు అడ్డంగా ఉన్న భవనాలను పురపాలక శాఖ అధికారులు తొలగిస్తున్నారు. గతంలో పేర్కొన్న విధంగా కాకుండా రోడ్డును అదనంగా పది అడుగుల మేర విస్తరిస్తున్నారని పేర్కొంటూ రైల్వే రోడ్డు భవన యజమానులు శనివారం నాడు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ రాజగోపాలనాయుడు అక్కడికి చేరుకుని భవన యజమానులతో చర్చించారు. గతంలో నిర్ణయించిన మేరకు 70 అడుగుల మాత్రమే విస్తరణ చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు నష్టపరిహారాన్ని ఇవ్వకపోగా, రోడ్డును 80 అడుగుల వరకు విస్తరణ చేస్తామని అధికారులు చెప్పడం సరికాదన్నారు. అధికారులు మొండిగా వ్యవహరిస్తే పనులను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రైల్వే రోడ్డును 70 అడుగులకు మించి విస్తరణ జరగదని, ఈ విషయంపై తాము అధికారులతో మాట్లాడతామని సిఐ హామీ ఇవ్వడంతో భవన యజమానులు శాంతించారు. ఈ కార్యక్రమంలో భవన యజమానుల తరపున జెఈ వెంకటస్వామి, పలువురు కౌన్సిలర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ రాజగోపాల్ నాయుడు

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ



కేసు పరిష్కారం పై చర్చిస్తున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి సమస్యలను వినతుల రూపంలో స్వీకరించారు. రెవెన్యూ సమస్యలను సంబంధిత అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌కు వచ్చే అధికారులు ఆ కేసుకు సంబంధించి సమగ్ర సమాచారంతో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నెరప్ప, న్యాయవాదులు సుదర్శన్, సిద్ధూ, నాగరాజు రెడ్డి, సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు పరిసరాల్లో 'స్వచ్ఛత సేవ'



కోర్టు పరిసరాలను శుభ్రం చేసి చెత్తను పారబోస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రాకేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగిరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కోర్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛత సేవాకార్యక్రమాన్ని శనివారం చేపట్టినట్లు పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి కె.రాకేష్ తెలిపారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రతి నెల మూడవ శనివారం కోర్టు పరిసరాల శుభ్రత కోసం స్వచ్ఛత సేవాకార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలను జారీచేసిందన్నారు. అందులో భాగంగా సిబ్బందితో కలిసి స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి బార్‌అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి-కదిరి టౌన్

మండల పరిధిలోని కదిరి బ్రాహ్మణపల్లి, మల్లయ్య గారిపల్లి గ్రామంలో పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా సిసి రోడ్డు పనులకు అధికారులకు భూమిపూజ చేశారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పోలప్ప, ఏపీవో శ్రీధర్ రెడ్డి, పిఆర్‌జెఇ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న అధికారులు

బానిసత్వాన్ని నిర్మూలిద్దాం



వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీలో పాల్గొన్న సిఐ, ఎస్ఐ, స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు

ప్రజాశక్తి-పెనుకొండ

'నడిచే నడక.. ప్రతి అడుగులో బానిసత్వాన్ని నిర్మూలిస్తాం' అనే సంకల్పంతో ముందుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఎన్జీవో ఆస్ట్రేలియా ఏ-21, ది మూమెంట్ ఇండియా ముంబై సహాయ సహకారాలతో గ్రామజ్యోతి సొసైటీ మదనపల్లి సౌజన్యంతో సమతా గ్రామీణ విద్య, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం వాక్ ఫర్ ఫ్రీడమ్ నిశ్శబ్ద నడక కార్యక్రమం నిర్వహించారు. శాంతినికేతన్, ప్రగతి స్కూల్ విద్యార్థులతో పట్టణంలో మానవ అక్రమ రవాణాపై నిశ్శబ్ద ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మనం నడిచే నడక న్యాయం, గౌరవం కోసం ఉండాలన్నారు. మానవ అక్రమ రవాణాతో జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. ప్రతి ఒక్క అడుగులో అనేకమందిని చేరుకోవడం చూస్తాం, బాధితులు రక్షించబడడం చూస్తాం అన్నారు. ఇంటర్నేష నల్ లేబర్ ఆర్గనైజేషన్-2024 ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 49.6 మిలియన్ల మంది ప్రజల అవయవాల దోపిడి, లైంగిక శ్రమ, బలవంతపు వివాహాలు సహ వివిధ రకాల ఆధునిక బానిసత్వంలో చిక్కుకొని ఉన్నారని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 150 మందిలో ఒక్కరు బానిసలుగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా మహిళలు, బాలికలు, చిన్నారులే లైంగిక దోపిడీకి బలవుతున్నారని వివరించారు. మానవ అక్రమ రవాణా లేని సమాజాన్ని మనం అందరూ చూడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉమెన్ ట్రాఫికింగ్‌కు గురైన వారు హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 181కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు, సమతా సంస్థ అధ్యక్షులు బి.ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ఇద్దరికి పాముకాటు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని శివానగర్‌కు చెందిన నారాయణస్వామి కుమారుడు ముత్యాలు, కేతిరెడ్డి కాలనీకి చెందిన వెంకటేష్ కుమారుడు పురుషోత్తం శనివారం వేర్వేరు ప్రాంతాల్లో పాముకాటుకు గురయ్యారు. వివరాలు.. ముత్యాలు పట్టణంలోని తిక్కస్వామి గుడి సమీపంలో ఉన్న నీటి కాలువ వద్ద దుస్తులు శుభ్రం చేస్తుండగా పాము కరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అలాగే పురుషోత్తం కేతిరెడ్డికాలనీలో బహిర్భూమికి వెళుతుండగా ప్రమాదవశాత్తూ పాముకాటుకు గురి కాగా కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం వారిద్దరినీ బంధువులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

చికిత్స పొందుతూ విద్యుత్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒప్పంద పద్ధతిన విద్యుత్ కార్మికుడిగా పని చేస్తున్న రియాజ్(30) శనివారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాలు.. రియాజ్ మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం స్థానిక వరగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో విద్యుత్ మరమ్మతులు చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ జారి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బెంగళూరుకు తీసుకెళ్లగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు.

పొగాకు ఉత్పత్తులపై డ్రైవ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలను పొగాకు రహిత ప్రాంతాలుగా మార్చడానికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి నివేదిత పిలుపునిచ్చారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తుల నిషేధంపై జిల్లా పొగాకు నియంత్రణ అధికారులు, విద్య, పోలీస్ శాఖల అధికారులు ఎన్‌ఫోర్స్ మెంట్ డ్రైవ్ నిర్వహించారు. నివేదిత మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయల వద్ద, విద్యాసంస్థలకు వంద గజాల లోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ. 200 జరిమానా విధిస్తారన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు అమ్మరాదన్నారు. అతిక్ర మిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తనిఖీలు చేసి పొగాకు ఉత్పత్తులు అమ్ము తున్న ఆరు షాపుల యజమానులకు చలానా విధించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులు వినియోగించడం ద్వారా వచ్చే అనారోగ్య సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త త్రిలోకనాథ్, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ మునిచంద్రిక, స్కూల్ హెచ్ఎం పి.సుధాకర్, కానిస్టేబుల్ నాగేంద్ర, పిహెచ్ఎన్ లలిత కుమారి, ఎంపిహెచ్ఎస్ రమణ, సూర్యశేఖర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్, ఎఎన్ఎం, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

కంటి జబ్బులపై జాగ్రత్తలు వహించాలి

ప్రజాశక్తి-హిందూపురం

కంటి జబ్బుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు నేహా, భవానీ సూచించారు. పట్టణంలోని మహాత్మగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 275 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 105 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు నిర్ధారించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ కుమార్‌రాజా మాట్లాడుతూ కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి చూపు ప్రసాదించాలన్న ఉద్దేశంతో తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో సంస్థ కార్యదర్శి ఉషారాణి, వైద్య శిబిరం పర్యవేక్షకులు శివ, వాలంటీర్ రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాడుదాం

ప్రజాశక్తి-రొద్దం


సిఐటియు మండల నూతన కమిటీతో నాయకులు

కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేద్దామని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో శనివారం రవి అధ్యక్షతన సిఐటియు అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఇందులో మండల కమిటీ నూతన కన్వీనర్‌గా రంజిత్ కుమార్, కో కన్వీనర్‌గా రవి, ఏడుగురు సభ్యులను ఎన్నుకొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయన్నారు. మండలంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాలని నూతన కమిటీకి సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు అరుణ, అనిత, పంచాయతీ యూనియన్ నేత రామంజి, తిప్పన్న, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు శ్యామల, టెంపో డ్రైవర్స్ యూనియన్ నేత ఈశ్వర్ పాల్గొన్నారు.

ఎపిఎంపై విచారణ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయంలో శనివారం ఎపిఎం సూర్యనారాయణపై డిఆర్‌డిఎ అధికారి ఓబులేసు విచారణ చేపట్టారు. ఎపిఎంపై మహిళా సభ్యురాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో జిల్లా పిడి ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విచారణ నివేదికను జిల్లా పిడి దృష్టికి తీసుకుపోతామని తెలిపారు.

సెక్రటరీలకు ఛార్జ్‌మెమో

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అమ్యూనిటీ సెక్రటరీలపై మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నిర్లక్ష్యం వీడని సచివాలయ కార్యదర్శులు' శీర్షికతో ప్రజాశక్తి దినపత్రిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అమ్యూనిటీ సెక్రటరీలందరికీ రెండు రోజుల వేతనం నిలుపుదల చేయడంతో పాటు ఛార్జ్‌మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

కల్తీలకు పాల్పడితే సహించం

ప్రజాశక్తి-హిందూపురం

వ్యాపారులు ఆహార పదార్థాల్లో కల్తీలకు పాల్పడితే సహించేది లేదని ఆహార భద్రత అధికారిణి తస్లీం హెచ్చరించారు. ఆమె శనివారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేసి తయారీ తేదీ, గడువు తేదీ లేని, కాలం చెల్లిన వస్తువులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఆమె మాట్లాడుతూ వ్యాపారులు ఆహార పదార్థాలను కల్తీ చేసినా, తయారీ, గడువు తేదీలు ముద్రించని, కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. తూముకుంట సమీపంలో శనివారం వాసవీ మహిళా మండలి, విప్రో కేర్స్ సహకారంతో కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ జబ్బులకు డాక్టర్ అబ్దుల్ వహీద్ చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో విప్రో అధికారులు, కుశాల్ క్లినిక్ సిబ్బంది సేవలందించారు.

ఎమ్మెల్యే ఆదేశంతో బస్సు సౌకర్యం

ప్రజాశక్తి-మడకశిర

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆదేశాల మేరకు అమరాపురం మండలంలోని బసవనపల్లి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారని టెక్నికల్ అసిస్టెంట్ తిరుమలగౌడ్ శనివారం తెలిపారు. ప్రతిరోజూ మండలం నుంచి పలువురు విద్యార్థులు ఇతర గ్రామాలకు వెళ్లాల్సి ఉండగా కనీసం బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్థానిక డిపో అధికారులతో సంప్రదించి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయించారు.

రేపు మండల సమావేశం

ప్రజాశక్తి-గోరంట్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నరేంద్రకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండ లంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపిడిఒ తెలిపారు.

అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై శనివారం బత్తలపల్లి వద్ద ఓ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. వివరాలు.. ఉదయం హెచ్‌పి గ్యాస్ సిలెండర్ల లోడుతో అనంతపురం నుంచి ధర్మవరం వెళ్తున్న లారీ బత్తలపలి వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకువెళ్లి వాలిపోయింది. గమనించిన ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్ కుమార్, స్థానికులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. డ్రైవర్ సమాచారం ఇవ్వడంతో ధర్మవరం హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు వచ్చి జెసిబిల సాయంతో లారీని బయటకు తీశారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్ర మత్తే కారణమని తెలుస్తోంది.

చెత్త తొలగించండి

మడకశిర : పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్ వద్ద చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రయాణికులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతు న్నారు. ఇకనైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని పట్టణవాసులు, ప్రయాణికులు, వ్యాపారులు కోరుతున్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ

ప్రజాశక్తి-సోమందేపల్లి


వర్షాలకు కూలిన పాఠశాల ప్రహరీ

ఇటీవల కురిసిన వర్షాలకు శనివారం మండలంలోని కేతగాని చెరువు పంచాయతీ గ్రామమైన సుద్దుకుంటపల్లిలో ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలిపోయింది. ఆరేళ్ల క్రితం ఓ వైపు ప్రహరీ కూలినా ఇప్పటివరకూ ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. ఈ పాఠశాలలో సుమారు 20 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పాఠశాలకు అవసరమైన నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఇఒ అంజినాయక్ మాట్లాడుతూ సుద్దుకుంటపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీ పాతది కావడంతో వర్షాలకు కూలిపోయిందన్నారు. దీనికి సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపించి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తలుపుల ఎస్ఐగా నరసింహుడు



ప్రజాశక్తి-తలుపుల

మండల నూతన ఎస్ఐగా నరసింహుడు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. పట్నం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా స్టేషన్‌లో సంప్రదించాల న్నారు. చట్ట విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. నూతన ఎస్ఐకు పోలీస్ సిబ్బంది స్వాగతం పలికారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి-కదిరి టౌన్


వాల్మీకి విగ్రహ ఏర్పాటు కోసం విరాళం అందజేస్తున్న కృష్ణమూర్తి

ఒడిసి మండలంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటు కోసం శనివారం వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విజయలక్ష్మి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు బంగారు కృష్ణమూర్తి రూ. 10 వేలు విరాళం అందించారు. ఒడిసిలో ఈ నెల 30వ తేదీ వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తిని ఆహ్వానించారు. కార్యక్రమంలో హర్షవర్ధన్, హరి, మనోహర్, కొండప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ ఎస్ఐగా శ్రీనివాసులు



ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐగా పి.శ్రీనివాసులు శనివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. బత్తలపల్లి స్టేషన్‌లో పని చేస్తున్న శ్రీనివాసులు సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ తమ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం, ఫ్యాక్షన్ గొడవలు, చోరీలు, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తామన్నారు. నూతన ఎస్ఐకి పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గాండ్లపెంట


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ నాగేంద్ర

స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం కదిరి రూరల్ సిఐ పి.నాగేంద్ర, ఎస్ఐ కృష్ణవేణి మండలం లోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా, వివాదాలు, గొడవలు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కుటుంబాల బాధ్యతలు చూసుకుంటూ ప్రశాంత జీవనం సాగించాలన్నారు. గొడవలు, కొట్లాట లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జమేదార్ శ్రీనివాసులు, పోలీసులు భాస్కర్, రాజు, శ్రీనివాసులు, నరసింహ, బాషా పాల్గొన్నారు.

22న జాబ్‌మేళా

బుక్కపట్నం : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని నైపుణ్య అభివృద్ధి అధికారి హరికృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్‌బాషా తెలిపారు. ఈ నెల 22వ తేదీ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తామని తెలిపారు. పీజీ, డిగ్రీ, డిప్లొమా, ఐటిఐ, ఇంటర్, పదో తరగతి పాసై 18-35 ఏళ్ల లోపు అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 7891541994లో సంప్రదించాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి


ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్న వైద్యులు

ప్రతి కుటుంబం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ రవినాయక్ సూచించారు. మండలంలోని వెల్దుర్తి గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముందుగా వైద్యాధికారితో పాటు సిబ్బంది వీధుల్లో కలియతిరిగారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వీధుల్లో వర్షం నీరు నిల్వ ఉండటం వల్ల టైఫాయిడ్, మలేరియా, తదితర విషజ్వరాల బారిన పడే అవకాశం ఉందని నీటి నిల్వలను తొలగించాలన్నారు. నివాస గృహాల చుట్టూ బ్లీచింగ్, ఫాగింగ్ చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విధిగా దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.


వర్షాలకు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండల వ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్ కోరారు. ఎడతెరిపిలేని వర్షాల వల్ల కోతకు వచ్చిన వేరుశనగ పంట పొలాల్లోనే దెబ్బతినిందని, మొలకలు వస్తున్నాయన్నారు. వేరుశెనగ కట్టె తడసి పశువుల మేతకు కూడా పనికిరాకుండా పోయిందన్నారు. వీటితో పాటు టమోటా, తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయన్నారు. వర్షాల కారణంగా పంట కోల్పోయిన రైతులను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిస్సార్ అహ్మద్, అనిల్‌కుమార్, నాగరాజు, గోపాల్ నాయక్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

ప్రజాశక్తి-బత్తలపల్లి


మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు చెక్కు అందజేస్తున్న ఉమ్మాల చంద్రశేఖర్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక టీచర్స్ కాలనీకి చెందిన రిటైర్డ్ హెచ్ఎం, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు ఉమ్మాల చంద్రశేఖర్ సిఎం సహాయనిధికి రూ. 10 వేలు విరాళం అంద జేశారు. చెక్కును శనివారం చంద్రశేఖర్ మండలంలోని మాల్యవంతం గ్రామంలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సమక్షంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు అందజేశారు. చంద్రశేఖర్‌ను మంత్రి సత్యకుమార్ అభినం దించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వరద బాధితులకు చేయూతనందించాలని కోరారు.

నూతన ఎస్ఐను కలిసిన టిడిపి నేతలు



ఎస్ఐ సోమశేఖర్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు


ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం టిడిపి నాయకులు నూతన ఎస్ఐ డి.సోమశేఖర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఎస్ఐ సోమశేఖర్‌ను నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు, నాయకులు సురేందర్‌నాయుడు, సూరి, బాలాంజనేయులు యాదవ్, ముళ్లగూరు సురేందర్‌నా యుడు, విశ్వనాథ్, రవి, కృష్ణయ్య, తరిగోపుల చౌదరి, చిన్నా, ముళ్లగూరు శ్రీనివాసులు కలిసి శాలువాతో సన్మానించారు.

వైవిఆర్ డ్యాంకు నీరివ్వండి : ఎంపిపి

ముదిగుబ్బ : మండలంలోని అడవి బ్రాహ్మణపల్లితండా సమీపంలో ఉన్న యోగివేమన జలాశయంలోకి హంద్రీనీవా నుంచి నీటిని విడుదల చేయాలని ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణయాదవ్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కోరారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న చెరువులకు నీరందిస్తే రైతులు పంటలు పండించేందుకు అవకాశం ఉందన్నారు. వైవిఆర్ డ్యాంకు నీరు విడుదల చేయాలని జిల్లా అధికారులను కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు ఎంపిపి తెలిపారు.

గిరిజన బాలికల హాస్టల్ తనిఖీ


హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న జడ్జి వాసుదేవన్

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని ఎపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్‌ను శనివారం పెనుగొండ సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ సందర్శించారు. ఆయన వంట గదులు, బాత్‌రూములను పరిశీలించారు. విద్యార్థినులకు అందాల్సిన సదుపాయాలపై వార్డెన్ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఎవరైనా అర్జీ రూపంలో పెనుకొండ కోర్టులో న్యాయ సేవా సమితిలో ఫిర్యాదు చేస్తే తక్షణమే సహాయక చర్యలు తీసుకుంటామని జడ్జి భరోసా ఇచ్చారు.

కొత్త సీసాలో పాతసారా..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కొత్త సీసాలో పాతసారా అనే చందంగా ప్రభుత్వ తీరు తయారైందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా అనేక హామీలను తెలుగుదేశం పార్టీ ఇచ్చింది. గత ప్రభుత్వ విధానాల్లో అనేక మార్పులు తీసుకొస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా మద్యం విధానంలోనూ మార్పులు చేపడతామని చెప్పింది. ఈ మేరకు కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గత ప్రభుత్వం మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించింది. ఈ ప్రభుత్వం ఆ విధానం రద్దు చేసి ప్రయివేటు వ్యక్తులకు ఇచ్చింది. దీని కోసం టెండర్లు పలిచింది. ఇందులో ఎక్కువ షాపులను అధికారపార్టీ నేతలే దక్కించుకున్నారు. వారి అనుమతి లేకుండా వేసిన వారికి చుక్కలు కనబడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ధర్మవరంలో ప్రతిపక్ష పార్టీకి చెందని ఒక దుకాణం తెరవగానే తెల్లారే సరికి ధ్వంసమైంది. ఇదిలా ఉంటే దక్కిన దుకాణాల్లోనూ అత్యధికం అధికారపార్టీ నేతలే ఉండటం గమనార్హం. అనంతపురం జిల్లా వరకు చూస్తే 136 దుకాణాలుంటే 27 శాతం దుకాణాలు ఒక ముఖ్య నేత అనుయాయులకే దక్కాయి. మరో వ్యక్తికి పది వరకు దక్కాయి. ఇక బిజెపి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఒక్కరికే ఐదు దుకాణాలు దక్కాయి. అవి కూడా ఆ పార్టీకి సంబంధించిన ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలోనే కావడం మరో విశేషం. ఇక అమ్మకాల వరకు చూస్తే అధికార పార్టీ నేతలకు సంబంధించిన వాటిల్లో ఇప్పటికే అనధికారిక పర్మిట్ రూములు ప్రారంభమయ్యాయన్న ఆరోపణలు న్నాయి. అధికారికంగా ప్రభుత్వం ఎక్కడా పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వలేదు. కాని నేతలు మాత్రం తమనెవరు అడగేదంటూ ప్రారంభించారు.

ఇసుక విషయంలోనూ అదే జరుగుతోంది. పేరుకు ఉచితమంటున్నా అది కేవలం నేతలకు మాత్రమే కావడం గమనార్హం. ఇసుక అనుమతుల్లేకుండా తోడేసి అమ్మేసుకుంటున్నారు సామాన్యుడికి మాత్రం గత ప్రభుత్వానికి ఇంచుమించు ధరల్లోనే ఇసుక లభిస్తోంది. పై రెండింటిపైనా పెద్దఎత్తున విమర్శలు రావడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి మరీ ఆ రెండింటి జోలికెళ్లవద్దని సూచించారు. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి ముగ్గురు నేతలకు సుతిమెత్తని హెచ్చరికలు చేసినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో అప్పటి అధికారపార్టీ నేతల తరహాలోనే ఇప్పటి అధికారపార్టీ నేతలు కూడా ఇసుక, భూములతో పాటు, కొత్తగా మద్యం కూడా తోడై డబ్బులు చేసుకునే పనిలో పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. పై వాటి విషయాల్లో అంతకు ముందు ప్రభుత్వానికి ఇప్పటికీ పెద్దగా తేడా లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొత్త విధానాలని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కొనసాగుతున్న తీరు మాత్రం పాత పద్దతుల్లోనే ఉందన్న ఆరోపణలున్నాయి.

ఈ వారంలో సిపిఎం బస్సు యాత్రను చేపట్టింది. జిల్లా రైతాంగానికి అత్యంత అవసరమైన సాగునీటి కోసం పోరాటాన్ని ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా బస్సుయాత్రను ప్రారంభించి శనివారంతో ఈ యాత్ర ముగిసింది. దీనికి ప్రజల నుంచి పలు చోట్ల స్పందన కనిపించింది. అనేక మంది మేధావులు, సామాజికవేత్తలు మద్దతు సైతం తెలిపారు. ప్రధాన పార్టీలకు భిన్నంగా సిపిఎం ప్రజా సమస్యలపై ఈ యాత్ర చేపట్టడం చర్చనీయాంశమైంది.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి-బత్తలపల్లి

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ఎన్‌డిఎ ప్రభుత్వంతోనే సాధ్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మండలంలోని మాల్యవంతం గ్రామంలో శనివారం నిర్వహించిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమానికి మంత్రితోపాటు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, ఇప్పుడిప్పుడే పల్లెల్లో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. అందరి సహకారంతో ధర్మవరం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రజలు గుంతలు పడిన రోడ్లతో నరకం చూశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రోడ్లకు మోక్షం కలిగిందన్నారు. అంతకుముందు మాల్యవంతం గ్రామంలో ఐదు చోట్ల సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు, కాటమయ్య, జడ్పిటిసి కోటి సుధ, సర్పంచి దేవి, ఆర్డీవో మహేష్, డ్వామా పిడి విజయ్ ప్రతాప్, పంచాయతీరాజ్ డిఇ శ్రీరాములు, ఎంపిడివో నరసింహానాయుడు, టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, బిజెపి మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

చెన్నేకొత్తపల్లి : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత శనివారం రామగిరి మండలంలో పర్యటించారు. నసనకోట పంచాయతీలోని గంగంపల్లి ఎస్టీ కాలనీలో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గ్రామాలకు రోడ్డు వేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాప్తాడు నియోజకవర్గానికి మాత్రమే రూ. 25 కోట్లు ఇచ్చారన్నారు. గ్రామాల్లో ఏ పనులు చేపట్టాలన్నదీ గ్రామస్థులే నిర్ణయించేలా గ్రామసభలు నిర్వహించామన్నారు. పనుల నాణ్యతలో ఎక్కడ లోపం ఉన్నా ప్రశ్నించే హక్కు మీకుంటుందన్నారు. ఈ పనులు పూర్తి కాగానే.. మరిన్ని నిధులు తీసుకొస్తామన్నారు. గంగంపల్లితండాలో కమ్యూనిటీ భవనం, అంగన్వాడీ భవనం, ప్రాథమిక పాఠశాల



బత్తలపల్లిలో పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్

ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

ఓబులదేవరచెరువు : మండలంలోని అల్లాపల్లి గ్రామపంచాయతీలో ఎంపిడివో రాబర్ట్ విల్సన్ పండ్ల తోటల పెంపకానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటరమణ, ఈవోఆర్డీ కేశవరెడ్డి, ఏపీవో సుధాకర్, ఏఈ ఆంజనేయులు, టెక్నికల్ అసిస్టెంట్ నాగముని, రాజేంద్ర, పంచాయతీ సెక్రటరీ మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ పూజారి రమణ, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండలంలోని నరసాపురం, శాసనకోట గ్రామాల్లో రోడ్డు నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిడివో శ్రీధర్, పంచాయతీ సెక్రటరీ సతీష్, భాస్కర్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు సూర్యనారాయణ, వెంకటేష్, నాగరాజు, నాగభూషణం, మహేష్ పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని రాళ్లపల్లి, ఎస్.రాయపురం, ఎస్ఎస్ గుండ్ల గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఎంపిడివో గంగాధర్, ఈఓఆర్డీ నాగరాజు నాయక్, నాయకులు మంజునాథ్, కృష్ణమూర్తి, రామాంజనేయులు, సన్నమారెప్ప, నాగరాజప్ప, ఆనందప్ప, మురళి, ఈరన్న, ప్రసన్న, శ్రీరామప్ప, బసప్ప, రామకృష్ణ, నాగరాజు, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడివో రామ్‌కుమార్, మండల సర్వేయర్ మైనుద్దీన్, నాయకులు వెంకట్రామిరెడ్డి, నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ మణి, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలోని మైదుగోళం గ్రామంలో ఎంపిడిఓ నరసింహామూర్తి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఆనంద్, పంచాయతీ సెక్రటరీ నాగరాజు, ఉపాధి హామీ ఏపీవో మధుసూదన్‌రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : గ్రామీణ ప్రాంత సమస్యల పరిష్కారానికా కూటమి పార్టీ ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం ఏర్పాటు చేసిందని కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వివిఎం పాండురంగప్ప తెలిపారు. రొళ్ల మండలంలోని కాకి పంచాయతీ, దొడ్డేరి పంచాయతీ, పిల్లిగుండ్ల, రొళ్లతండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దాసరెడ్డి, ఎంపిడివో ప్రసాద్, నాయకులు రామకృష్ణ, భరత్, తదితరులు పాల్గొన్నారు.

అగళి : గ్రామాల అభివృద్ధికే రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమం నిర్వహిస్తుందని అధికారులు, టిడిపి నాయకులు తెలిపారు. మండలంలోని ఇనగలూరు పంచాయతీలో శనివారం సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. పశువుల షెడ్లు, బౌండరీ ట్రెంచ్, ఫారంపండ్, తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. టిడిపి మండల అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ పనులను 3 నెలల్లో పూర్తి చేసి జనవరిలో ప్రారంభించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పదేళ్లు వెనక్కు వెళ్లిందన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మడకశిర నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఒ శివన్న, నాయకులు శివకుమార్, నందకుమార్, నరసింహప్ప, నాగరాజు, సన్నప్ప, కృష్ణప్ప, నరసింహప్ప, తిప్పేస్వామి, వీరక్యాతప్ప, హనుమంతు, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా రూరల్ మండలంలోని కిరికెర, తూమకుంట గ్రామాల్లో రూ. 1.90 కోట్లతో సీసీ రోడ్డు పనులను ఎంపిడిఓ సరస్వతి ఆయా పంచాయతీల సర్పంచులతో కలిసి ప్రారంభించారు. కిరికెర పంచాయతీలో రూ. 1.50 కోట్లతో 5 సీసీ రోడ్లు, తూమకుంటలో రూ. 40లక్షలతో ఒక సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కార్యక్రమంలో తూమకుంట సర్పంచి రత్నమ్మ, చిన్నవీరప్ప, పిఆర్ ఎఈ హనుమేనాయక్, టిడిపి నాయకులు వేణుగోపాల్, మూర్తి, నాగరాజు, ముద్ద కృష్ణ, శీన, పంచాయితీ కార్యదర్శులు కెంచరాయప్ప, ఇబ్రహీం,

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీలో శనివారం రీ సర్వే భూ సమస్యలపై గ్రామ సభ నిర్వహించగా ముఖ్యఅతిథిగా తహశీల్దార్ రెడ్డి శేఖర్ హాజరయ్యారు. తహశీల్దార్ మాట్లాడుతూ గతంలో జరిగిన రీ సర్వేలో కొందరు రైతుల భూముల వివరాలు తప్పుగా నమోదయ్యాయన్నారు. వాటి పరిష్కారానికి ప్రస్తుత ప్రభుత్వం రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తుందన్నారు. వన్-బి, పట్టాదారు పాసుపుస్తకం, అడంగల్, తదితర రెవెన్యూ అంశాల్లో ఏదైనా తప్పుగా నమోదై ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. గ్రామంలో వీఆర్వో అందుబాటులో ఉంటారని, ఇంకా ఏమైనా సమస్య ఉంటే స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించి సమస్యలను పరిష్కరిం చుకోవాలని రైతులకు సూచించారు. గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్, మండల సర్వేయర్ వినోద్‌కుమార్‌రెడ్డి, వీఆర్వో అన్నపూర్ణ, రైతులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : భూ రీసర్వేలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించ డానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ స్వర్ణలత తెలిపారు. మండలంలోని చెన్నరాయపట్నం, రాఘవంపల్లి గ్రామాల్లో రీ సర్వే సమస్యలు పరిష్కరించడానికి గ్రామసభలు నిర్వహించారు. మండలంలో పైలెట్ గ్రామంగా తీసుకున్న చెన్నరాయపట్నంలో రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభ నిర్వహించి నట్లు తహశీల్దార్ తెలిపారు. రైతులు సమస్యలను అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. చెన్నరాయపట్నం గ్రామసభలో 38, ఈదుల ముష్టూరు పంచాయతీలోని రాఘవంపల్లి గ్రామసభలో 10 అర్జీలు అందాయి. గ్రామసభల్లో సర్వేయర్ మురళి, రీసర్వే డిటి షణ్ముఖకుమార్, సర్వేయర్ జోసెఫ్, వీఆర్వోలు విష్ణువర్ధన్‌రెడ్డి, సాకే ప్రసాద్, బిజెపి మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప, మొర్రెడ్డి గారి సత్యనారాయణరెడ్డి, శీన, నాయకులు పాల్గొన్నారు.

రొద్దం : జాయింట్ భూములను సబ్ డివిజన్ చేసుకోవాలని తహశీల్దార్ నాగేంద్ర రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని బూచెర్ల గ్రామంలో గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.



సోమందేపల్లిలో రీసర్వే గ్రామసభ నిర్వహిస్తున్న తహశీల్దార్ రెడ్డిశేఖర్

కార్యక్రమంలో రీసర్వే డిటి చంద్రశేఖర్, మండల సర్వేయర్ మైనుద్దీన్, వీఆర్వోలు సూర్యనారాయణ, అనిల్, సర్పంచి సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : గతంలో రీ సర్వేలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ కరుణాకర్ తెలిపారు. మండలంలోని కల్లుమర్రి పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి గంగమ్మ, నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, నాయకులు నరసన్న, గోవిందప్ప, నర్సేగౌడ్, పెద్దమూర్తి, మూర్తి, రంగనాథ, నారాయణప్ప, నరసింహ, వెంకటేషులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా గ్రామాల్లో రీసర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నటరాజ్ తెలిపారు. మండలంలోని తుమ్మల గ్రామంలో గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వీటిపై త్వరలోనే విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ నెల 21వ తేదీ రావులచెరువు, 22న గొట్లూరు, 23న దర్శనమలలో రీసర్వేపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రమేష్‌బాబు, మండల సర్వేయర్ మంజులాదేవి, వీఆర్వోలు లక్ష్మీనరసమ్మ, నారాయణస్వామి, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని తహశీల్దార్ సి.భాస్కర్‌రెడ్డి తెలిపారు. తాడిమర్రి మండలంలోని కొండయ్యపల్లి గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కరించు కోవాలన్నారు. సమావేశంలో సర్వేయర్ సుశాంతి, వీఆర్వోలు, పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని చెన్నాపురం గ్రామంలో శనివారం వాల్మీకి సామాజిక వర్గం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు వీధుల వెంబడి నృత్య ప్రదర్శనగా జ్యోతులు తీసుకెళ్లి వాల్మీకి విగ్రహం వద్ద సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ ప్రతి వాల్మీకి కుటుంబం తమ పిల్లలను ఉన్నత విద్య చదివించాలన్నారు. ఉన్నతంగా, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలతో జీవించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి నరసింహమూర్తి, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, కొల్లప్ప, అంజి, వెంకటరత్నం, మారుతి, మండ్లి హనుమంతు, లక్ష్మీ సతీష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మొబైల్ ఆధార్ వారోత్సవాలు

ధర్మవరం రూరల్ : మొబైల్ ఆధార్ వారోత్సవాల్లో భాగంగా మండలంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తామని ఎంపిడిఒ సాయి మనోహర్ తెలిపారు. మండలంలోని ఏలుకుంట్ల, దర్శినమల, గొట్లూరు-1, చిగిచెర్ల, పోతులనాగేపల్లి గ్రామ పంచాయతీల్లో మొబైల్ క్యాంపులు నిర్వహిస్తామని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ తెలిపారు.

వేరుశనగ పంటకోత ప్రయోగం

గోరంట్ల : మండలంలోని వానవోలు పంచాయతీలో శనివారం రైతులు విశ్వనాథ, సురేంద్ర పంట పొలాల్లో వేరుశనగ పంట కోత ప్రయోగం నిర్వహించినట్లు ఏవో మునికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ మల్లికార్జున, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చౌకధాన్యం డీలర్ల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల చౌక ధాన్యం డీలర్ల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని డీలర్లంతా శనివారం స్థానిక మాణిక్యం ఫంక్షన్ హాల్ వద్ద సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షున్నిగా గుంటిపల్లి గ్రామానికి చెందిన డీలర్ వెంకటేశు, ఉపాధ్యక్షున్నిగా కొత్తచెరువుకు చెందిన డ్రైవర్ కేశప్పను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ డీలర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. మండలంలోని ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, డీలర్లు సైకిల్ షాపు బాబా, భాస్కర్, శివ, మాధవి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్లకు శిక్షణ

లేపాక్షి : మండలంలోని పులమతి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కౌట్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన శనివారం విద్యార్థులకు తాళ్లను ఎలా ముడివేయాలి, వాటి ఉపయోగాలు, దిక్సూచిని ఎలా ఉపయోగించాలి, ప్రథమ చికిత్సపై లీడర్ ఆఫ్ ది కోర్స్ ప్రసాద్, నాగరాజు, జిల్లా సెక్రెటరీ గిరిధర్, స్కౌట్ ఉపాధ్యాయులు వివరించారు. రమామణి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా కరణం రమానందన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బారావు విద్యార్థులకు సదుపాయాలు ఏర్పాటు చేశారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి


ప్రజాశక్తి-అమడగూరు

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. ఎస్ఐ శనివారం సిబ్బందితో కలిసి ఆంధ్ర, కర్నాటక మార్గంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి కలిగి ఉండాలని తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల జరిగే ప్రమాదాలు, అనర్థాలను వివరించారు. అలాగే మద్యం తాగి వాహనం నడిపినా, కర్నాటక మద్యం రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిగి చెరువుమరువ మరమ్మతులు

ప్రజాశక్తి-పరిగి

పరిగి చెరువుకు ఎగువ ప్రాంతంలోని కర్నాటక నుంచి వరద నీరు చేరుతుండడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. చెరువు మరమ్మతులతో పాటు తూములు, మరువల మరమ్మతులు ప్రారంభించారు. ఇటీవలే పరిగి ట్యాంక్ బండ్‌ను ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించగా రైతు సంఘం నాయకులు మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీంతో మంత్రి సవిత ప్రత్యేక చొరవ తీసుకొని అవసరమైన నిధులు సమకూర్చే లా ఇరిగేషన్ డిఈ లక్ష్మీనారాయణతో చర్చించి వెంటనే పనులు ప్రారంభిం చాలని ఆదేశించారు. రెండు రోజుల ముందు ప్రారంభమైన పనులు శనివారం నాటితో ముగియడంతో ఇరిగేషన్ అధికారులతో పాటు నాయకులు శనివారం పరిశీలించారు. వారిలో టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, లక్ష్మణరావు, డిఎస్ఎల్ శ్రీనివాసులు, నాగభూషణం ఉన్నారు.



పరిగి చెరువు తూములు, మరువల మరమ్మతులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు